

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (సోమ)	సా.6.24
	సహరి (మంగళ)	ఉ.4.42

నేడు హోలీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు - 7వ పేజీ

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం - 7వ పేజీ

ముగిసిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు - 7వ పేజీ




రాజమండ్రి లోక్‌సభకు పురందేశ్వరి

సీనియర్ ఎన్‌టీఆర్ కుమార్తెగా సుపరిచితం

- కూటమి అభ్యర్థిగా ప్రకటించిన బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా తనదైన ముద్ర
- జాతీయ రాజకీయాల్లో రాణిస్తున్న వైనం
- గతంలో కేంద్ర మంత్రిగా చేసిన అనుభవం
- టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణుల్లో జోష్
- త్వరలో రాజమహేంద్రవరానికి రాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరు ఖరారైంది. ఎప్పటి నుంచో ఆమె అభ్యర్థిత్వంపై ప్రచారం ఉన్నప్పటికీ ఆదివారం రాత్రి బీజేపీ జాతీయ నాయకత్వం ఆమె పేరును ఖరారు చేసింది. రాష్ట్రంలో ఆరుగురు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు.అందులో పురందేశ్వరి పేరు కూడా ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారు కావడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో జోష్ పెరిగింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు కుమార్తె కావడం కూటమికి బాగా కలిసి వచ్చే అంశం. అంతేగాక టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్వయానా సోదరి. ఎన్టీఆర్ కుటుంబం నుంచి వచ్చిన మహిళా నేతల్లో బాగా రాణిస్తున్న నేత ఆమె.గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. బీజేపీకి రాష్ట్రంలో తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా ఆమె ఎనలేని పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బీజేపీలో కూడా జోష్‌పెరిగింది. క్యాడర్‌లో కదలిక వచ్చింది. అంతకుముందు నేతలుకేడర్ పట్టించుకోలేదని, కనీసం సొంత అనుచరులను గాలికి వదిలేశారనే అపవాదు ఉంది. అయితే పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాత బీజేపీలోని పాత, కొత్తనేతలందరినీ కలుపుకుంటూ ముందుకు వెళుతున్నారు. దానికి తోడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషితో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు కూడా కుదిరింది.దీంతో ఆమెను చారిత్రిక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో దించారు. త్వరలో ఆమె ఇక్కడకు రానున్నారు.బీజేపీతో పాటు, టీడీపీ, జనసేన క్యాడర్‌ను కలుపుకుని ప్రచారం మొదలు పెట్టనున్నారు. రాజమహేంద్రవరం నుంచి గతంలో బీజేపీ రెండు సార్లు గెలిచిన సంగతి తెలిసిందే. లోక్‌సభకు రెండుసార్లు, అర్బన్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఒకసారి గెలిచింది. రెండు సార్లు టీడీపీతో పొత్తు వల్లే గెలిచింది. ఈసారి ఏకంగా టీడీపీ -జనసేన కూడా కలవడంతో బీజేపీ అభ్యర్థికి బాగా బలం పెరిగినట్టు అయింది. ఈ లోక్‌సభ స్థానం గోదావరికి ఇటు ఇటూ ఉన్న ప్రాంతం. ఈ స్థానం టీడీపీకి కంచుకోట. పోల్‌మేనేజ్‌మెంట్ వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత క్యాడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచాయి. కానీ గెలిచిన ప్రతిసారి ఓట్లశాతం పరిశీలించినా, మెజార్టీ శాతం పరిశీలించినా టీడీపీయే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన 2014లో జరిగిన ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి సినీనటుడు మాగంటి మురళీ మోహన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకు ముందు జరిగిన ఎన్నికల కంటే అదనంగా 19.72 శాతం సాధించారు. ఇంత వరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది.ఇది 14.29 శాతం మెజార్టీ. అప్పట్లో వైసీపీ తరఫున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణ చౌదరికి 4,63,139 ఓట్లు వచ్చాయి.అది 40.12 శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరఫున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీ చేసి 4,60,390 ఓట్లు అంటే 36.82 శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీ చేసి 1,55,807 ఓట్లు అంటే 12.46 శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55 శాతం ఓట్లు సాధించి 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73 శాతం మెజార్టీ. ఈసారి ఈ లెక్కలే కాక, అధికార పార్టీ మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, టీడీపీ,జనసేన, బీజేపీ ఐక్యత వల్ల ఉమ్మడి అభ్యర్థి బలమే ఎక్కువ ఉంటుంది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా డా.గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ద్విముఖ పోటీనే ఉంటుంది. ఈ లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ నేతలు చాలా మంది ఆశపెట్టుకున్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఇక్కడ టికెట్ ఆశించారు. రాజానగరం టికెట్ ఇస్తానని మొదట్లో టీడీపీ అధిష్టానం ఆయనకు హామీ ఇచ్చింది. పొత్తులో అది జనసేనకు కేటాయించడంతో చివరకు లోక్‌సభ స్థానం నుంచి అవకాశం ఉంటుందనే ప్రచారం జరిగింది. 2014లో ఆయన వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, శిష్టా లోహిత్, గన్ని కృష్ణ, పార్టీ సమన్వయకర్త వై.రవి, వంటి వారు టికెట్ ఆశించారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల కూటమి అభ్యర్థిగా పురందేశ్వరి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో మూడు పార్టీల్లోనూ జోష్ పెరిగింది.



కళ్లెదుట ఎండిపోతున్నా.. కాపాడుకోలేని దైన్యం

- ఏలేరు ఆయకట్టు భూములకు బీటలు
- ఎండిపోతున్న వరి పంట
- ఎకరానికి రూ.30వేలకు పైగా కష్టం

ఏలేరు ఆయకట్టు పరిధిలో బి.ప్రత్తిపాడు-భోగాపురం గ్రామాల మధ్య ఎండిపోతున్న వరి పంట

పిఠాపురం, మార్చి 24: కళ్లెదుటే పంట ఎండిపోతోంది. పొలాలు బీటలు వారాయి. సాగునీరు అందని దుస్థితి. అయినా పంటను కాపాడుకోలేని స్థితిలో రైతులు ఉన్నారు. ఎకరాలకు ఎకరాలు ఎండిపోతున్నా అధికారుల్లో కనీస కదలిక కొరవడింది. పలుమార్లు ఆందోళనలకు దిగినా ప్రకటనలు తప్ప క్షేత్రస్థాయిలో చుక్కనీరు అందడం లేదు.

అందని సాగునీరు

రెండోపంటకు పుష్కలంగా సాగునీరందిస్తామని ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించడంతో ఏలేరు పరిధిలో రైతులు దాళ్వా వరిసాగును ప్రారంభించారు. నారుమడుల దశ నుంచి సాగునీటి సమస్య వెన్నాడినా మీకు ఇబ్బందులు ఉండవని చెప్పడంతో నాట్లు వేసుకున్నారు. అక్కడినుంచి రైతుల కష్టాలు ప్రారంభమయ్యాయి. వంతు సమయాల్లో సాగునీరందని పరిస్థితి ఉంది. పలుమార్లు కలెక్టరు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ప్రస్తుతం పంట ఎండి పొలాలు బీటలు వారుతోంది.

ఎండిపోతున్న వరిపంట

పిఠాపురం మండలంలోని బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తిల్లో 500 ఎకరాల్లో పూర్తిగా, పి.రాయవరం, తిమ్మాపురం, దొంతమూరు, వెల్దుర్తి గ్రామాలతోపాటు గొల్లప్రోలు పట్టణ శివారుల్లోని వెయ్యి ఎకరాల్లో పాక్షికంగా దాళ్వా వరిపంట ఎండిపోతోంది. ఏలేరు రిజర్వాయర్‌నుంచి విడుదలైన నీరు ఈప్రాంతానికి అందడంలేదు. నెలరోజులుగా బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తిల్లోని పంట పొలాలకు సాగునీరు చేరకపోవడంతో భూములు బీటలు వారడంతోపాటు వరిపంట ఎండిపోయింది. వ్యవసాయ, ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో పర్యటించినా పరిస్థితిలో మార్పులేదు.

నిర్లక్ష్యమే శాపం

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే రైతులకు శాపంగా మారింది. సాగునీటి యాజమాన్యం, వంతులవారీ విధానాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన అధికారులు వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి ఇష్టారాజ్యంగా సాగునీటిని మళ్లించడంతో అసలు ఆయకట్టుకు నీరందలేదు. రిజర్వాయర్‌నుంచి విడుదలవుతున్న నీరు ఆయకట్టుకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహించారనే విమర్శలున్నాయి. ఎల్లప్పుడూ ఒకే ప్రాంతానికి నీరు అందించడంపై దృష్టిపెట్టిన అధికారులు, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ను సైతం ఇరిగేషన్ అధికారులు తప్పుదోవ పట్టించారని వారు ఆరోపించారు.

పెట్టుబడులు కోల్పోయాం

దాళ్వావరికి సాగునీరు అందకపోవడంతో పంట ఎండిపోయి పొలాలు బీటలు వారి తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. ఎకరానికి రూ.30వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, అంతా కోల్పోయినట్లేనని రైతులు తోట రాంబాబు, చక్రపాణి, పాలిశెట్టి సూరిబాబు, బ్రహ్మదేవు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందిస్తామని తమను నట్టేట ముంచారని తెలిపారు. బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి గ్రామాల్లో 500 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయిందని, కనీసం ఇప్పటివరకూ ఒక్క అధికారి తమ ప్రాంతానికి రాలేదని వారు చెప్పారు. సాగునీరు అందించలేమని చెప్తే పంటలు వేసుకోకుండా అపరాలు సాగు చేసుకునే వారమని తెలిపారు. ఇప్పుడు సాగునీరు అందినా ఉపయోగం లేదని వారు చెప్పారు. రిజర్వాయర్‌నుంచి విడుదలవుతున్న నీటిని ఎక్కడికి పంపారో అధికారులు చెప్పాలని, ప్రకటనలకు వాస్తవ పరిస్థితికి పొంతనలేదని వారు తెలిపారు.



ఘనంగా మట్టల ఆదివారం పండుగ

జిల్లాలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈఠత మట్టలకు రంగురంగుల పువ్వులతో అలంకారం చేసి చర్చిలకు తీసుకువెళ్లారు. అలా పెద్దాపురంలో తీసుకెళ్తున్న క్రైస్తవులు..



నిబంధనలు.. బేఖాతర్

- వాక్ ఇన్ లిక్కర్ స్టోర్స్‌లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు
- కోడ్ ఉన్నా అనధికారిక విక్రయాలు

అచ్చంపేట సెంటర్‌లో రాత్రి 9గంటల తర్వాత వాక్ ఇన్ లిక్కర్ స్టోర్‌లో మద్యం విక్రయాలు

సర్పవరం జంక్షన్, మార్చి 24: వాక్ ఇన్ లిక్కర్ స్టోర్.. మద్యం ప్రియులకు కిక్ అందించేందుకు ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మద్యం దుకాణాలు.. ఈ స్టోర్ నిర్వహణ అంతా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడుస్తోంది. కానీ, ఎమ్మార్పీ కంటే అదనంగా ఒక్కో బాటిల్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు పెంచి విక్రయాలు సాగిస్తున్నా.. ఎక్సైజ్ అధికారుల కళ్లకు కనిపించడం లేదు. షాపు లీజుకు తీసుకున్న నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడుతున్న అధికారులు ఆ దుకాణాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిర్వాహకులు ఎన్నికల కోడ్ అమల్లో సైతం సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విక్రయాలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మార్పీకే మద్యం అమ్మాలని, రాత్రి 8 గంటలకు కౌంటర్ మూసేయాలన్న నిబంధనలు ఉన్నా విక్రయాలు సాగిస్తున్నారని, దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మద్యంప్రియుల సౌలభ్యంకోసం..

మద్యం ప్రియుల కిక్ కోసం ప్రభుత్వం సూపర్ మార్కెట్ తరహాల్లో వాక్ ఇన్ లిక్కర్ షాపులను ఏర్పాటు చేసింది. కాకినాడ రూరల్, సిటీ ప్రాంతాల్లో ముఖ్యమైన సెంటర్లు, కూడళ్ల వద్ద ఈ లిక్కర్ స్టోర్స్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. దీంతోపాటు మద్యంప్రియుల సౌలభ్యంకోసం వాక్ ఇన్ లిక్కర్ షాపుల ఏర్పాటు చేసింది. 1000 చదరపు గజాల స్థలం కంటే అదనంగా ఉండే ప్రదేశంలో వాక్ ఇన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ స్టోర్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఫర్నీచర్, షోకేసులు, విద్యుత్తు, ఏసీలు, ఫ్రిజ్‌లు తదితర మౌలిక సౌకర్యాలన్నీ స్థలం లీజుకు తీసుకున్న నిర్వాహకుడు సిద్ధం చేయాలి. ఈ స్టోర్ నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్తు చార్జీలన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది. షాపు నిర్వాహకుడికి మాత్రం అద్దె కింద నెలకు ప్రాంతాన్ని బట్టి రూ.60 నుంచి రూ.90వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. మద్యం సరఫరా అంతా ప్రభుత్వమే స్టోర్‌లకు పంపిణీ చేస్తోంది. ఈ స్టోర్‌వల్ల ప్రభుత్వానికి ఆదాయం ఎంత వస్తున్నా నిర్వాహకులకు, ఎక్సైజ్‌అధికారులకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాల్సి ఉండగా, అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకు నిర్వాహకులు అనధికారికంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులన్నీ నేరుగా ప్రైవేట్ వ్యక్తులు, ఆ శాఖ అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ఎమ్మార్పీ ధరలపై పలుసార్లు వీటిని పర్యవేక్షిస్తున్న సదరు శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలన్నీ(వాక్ ఇన్ లిక్కర్ స్టోర్స్‌తో)సహా అన్ని ఉదయం 11గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విక్రయాలు జరపాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అకౌంట్స్‌కోసం మరో గంట ఇవ్వాలన్న అభ్యర్థన మేరకు మెమో ఇచ్చింది తప్పా జీవో ఇవ్వలేదని, అయినా సరే రాత్రి 9 గంటలు దాటిన తర్వాత 10 గంటల వరకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా సరే తమకు సంబంధం లేదని, తమల్ని ఎవరూ ఏమీ చేయలేరని ఉద్దేశంతో రాజకీయ నాయకుల అండతో నిబంధనలు ఉల్లంఘించి అనధికారిక విక్రయాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ స్టోర్‌ల్లో సమయపాలన, అధికధరల నియంత్రణకోసం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

-వరప్రసాద్ సాధనాల, ఎక్సైజ్‌శాఖ డీఎం, సామర్లకోట

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు, వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లలో మద్యం బాటిళ్ల ఉన్న ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. సమయ పాలన తప్పకుండా పాటించాలి. ఎక్సైజ్‌శాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి ఫిర్యాదులైనా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

ఆదాయ వనరుగా లిక్కర్ల స్టోర్లు

మద్యంప్రియులకు కిక్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లపై ప్రభుత్వానికి ఏమాత్రం ఆదాయం వస్తోందో తెలియదు కానీ.. వీటి నిర్వాహకులు, ఎక్సైజ్‌శాఖ అధికారులకు ప్రధాన ఆదాయవనరుగా మారింది. ఈ స్టోర్‌ల ఏర్పాటుకు అవసరమైన స్థలం, స్టోర్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తే.. మద్యం సరఫరా, విక్రయాలు నిర్వహించే సిబ్బందికి, కరెంట్ తదితర నిర్వహణ ఖర్చులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఒక్కోస్టోర్ ఏర్పాటుకు రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు నిర్వాహకులు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. స్థలానికి అద్దె రూపంలో ప్రభుత్వం ప్రాంతాన్ని బట్టి నెలకు రూ.60వేల నుంచి రూ.90వేల వరకు చెల్లిస్తోంది. స్థల యాజమానికి రూ.20వేల నుంచి రూ.30వేలు అద్దె చెల్లించి మిగతా డబ్బులు నిర్వాహకులకు అద్దెరూపంలో మిగులుతుంది. మద్యం బాటిల్స్ ధరలపై ఉన్న ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఒక్కో నిర్వాహణదారుడికి రోజుకు అమ్మకాలు బట్టి రూ.30వేల నుంచి రూ.40వేలు ఆదాయం అదనంగా లభించే అవకాశాలున్నాయి. దీంతో వాక్‌ఇన్ లిక్కర్ స్టోర్‌లు ప్రతిపాదన వస్తే ముందుగా రాజకీయ నాయకులు వాలిపోతున్నారు. వీరు తమ అనుచరులకే ఈ స్టోర్‌లు మంజూరయ్యేలా సిఫారసు లేఖలు ఇచ్చి మంజూరు చేయించుకుంటున్నారు. కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో 10కి పైన వాక్‌ఇన్ లిక్కర్ స్టోర్స్ ఉన్నాయి. ఇందులో కాకినాడ రూరల్‌లో ఎస్వీ రంగారావు విగ్రహం సమీపాన, నాగమల్లితోట జంక్షన్, గొడారిగుంట, వలసపాకల, తిమ్మాపురం అచ్చంపేట సెంటర్లలో వాక్ ఇన్ లిక్కర్ స్టోర్లు ఉన్నాయి. మద్యం దుకాణాలు, వాక్ ఇన్ లిక్కర్ స్టోర్స్ నిర్వహణ, అమలుపై పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాహకులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడిన అధికారుల తీరు కారణంగా తమ జేబులకు చిల్లుపడుతుందని మందుబాబులు ఆరోపిస్తున్నారు.

పవన్‌కల్యాణ్‌తో మాజీ ఎమ్మెల్యే వర్మ భేటీ

- పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చ



జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

పిఠాపురం, మార్చి 24: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావుతో కలిసి వర్మ పవన్‌ను కలిశారు. పవన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. పిఠాపురం నియోజకవర్గంనుంచి పవన్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఇక్కడి రాజకీయ పరిస్థితులపై పవన్, వర్మ మధ్య చర్చ జరిగింది. పిఠాపురంనుంచి పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వర్మ, సుజయ కృష్ణరంగారావు తెలిపారు. నియోజకవర్గంలో తాము నిర్వహిస్తున్న ప్రచారం గురించి వర్మ వివరించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ త్వరలోనే పిఠాపురం నియోజకవర్గంనుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత పురుహూతికా అమ్మవారికి పూజలు నిర్వహించి దత్తపీఠాన్ని దర్శించుకుంటానని చెప్పారు. అనంతరం వర్మ ఇంటికి వెళ్లిన తర్వాత పిఠాపురం నియోజకవర్గ టీడీపీ నేతలతో సమావేశమవుతానని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీలు సమన్వయంతో ఎన్నికల్లో పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా జనసేన, బీజేపీతో సమన్వయం చేసుకుని టీడీపీ పనిచేస్తుందన్నారు. ఇప్పటికే ఈ దిశగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు అన్నివర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పవన్‌ను కలిసిన వారిలో వర్మ తనయుడు గిరీష్‌వర్మ, ఆయన బంధువు చిరంజీవి, టీడీపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్ కార్యక్రమం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24: జిల్లాలో ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనను వెలువరించారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్‌శాతం పెంచేందుకు ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా జరుపుతున్నామన్నారు. బలమైన ప్రజాస్వామ్యంకోసం అర్హులైన వారందరూ ఓటుహక్కును వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా కళాశాలల్లో, జనసామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వాలనుంచి వివిధ సేవలు హక్కుగా ఎలా కోరుకుంటామో.. ఓటుహక్కును కూడా బాధ్యతగా వినియోగించుకోవాలన్నారు. ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లకు అభ్యర్థులు 48గంటల ముందు అనుమతి తీసుకోవాలన్నారు. వీటిని పొందేందుకు సువిధ యాప్ ఉపయోగించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

వలంటీర్ల ముసుగులో గృహసారథులు

- సచివాలయ వ్యవస్థలో ప్రత్యేక వ్యవస్థ
- తాయిలాల పంపిణీకి ఎత్తుగడలు
- కొరడా ఝుళిపిస్తున్నా మారని తీరు

తుని రూరల్, మార్చి 24: ఎన్నికల సంఘం వలంటీర్లపై కొరడా ఝుళిపిస్తున్నా తీరు మారడం లేదు. దీనికి అనుసంధానంగా ఉన్న గృహసారథుల వ్యవస్థను రంగంలోకి దించి వైసీపీ లబ్ధి పొందాలని చూస్తోంది. జిల్లాలో కాకినాడ నగరపాలక సంస్థతోపాటు ఆరో ఆరు మున్సిపాల్టీలు, 20 మండలాల్లో 11273మంది వలంటీర్లు సేవలు అందిస్తుండగా వీరికి అనుసంధానంగా అంతకుమించి గృహసారథులు ఉన్నారు. ఇప్పటికే వీరిని వలంటీర్లు పలు పథకాల లబ్ధి సమయంలో వెంట పెట్టుకుని వెళ్లారు. ఇలా వీరిని లబ్ధిదారులతో అనుసంధానం చేయగా వారి ద్వారా తాయిలాలు పంపిణీకి దిగుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి 50ఇళ్లకు ఇద్దరు గృహసారథుల పేరిట వ్యవస్థ ఉండగా వీరితో వలంటీర్లు కలిసి పనిచేయడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వం ఓటర్లను బుట్టలో వేయాలన్నట్లు చేస్తోంది. సచివాలయ స్థాయిలో ముగ్గురు కన్వీనర్లను నియమించి వీరితో కలిసి వలంటీర్లు, గృహసారథులు పనిచేస్తున్నారు. వలంటీర్ల వద్ద ఉన్న సమాచారం గృహసారథుల వద్దకు చేరింది. వలంటీర్లు, వీరు కలిసి ఇళ్లకు చేరేందుకు సన్నాహాలు చేస్తోంది. మీకు ఇంత లబ్ధి వచ్చింది అన్నను ఆశీర్వదించండని కోరుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం. దీనిపై ఎక్కడికక్కడ దుమారం రేగుతోంది. ప్రతిపక్ష పార్టీల నాయకులు వీరిపై దృష్టిసారించారు. ఈ పరిస్థితులు గొడవలకు దారి తీసి శాంతిభద్రతల సమస్య ఏర్పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు నెహ్రూ, రాజప్పలను కలిసిన కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్

కేఎస్ఈజెడ్‌లో సంధ్య ఆక్వా బస్ కలకలం

- నాలుగురోజులుగా ఒకేచోట ఉన్న బస్
- పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- ఫైల్స్, స్పేర్ పార్ట్‌లుగా గుర్తింపు

- మెయిన్‌లో



చక్రస్నానం



కోనేరు వద్దకు పల్లకిలో వెళ్తున్న స్వామివారు

లక్ష్మీనరసింహుని చక్రతీర్థం

కోరుకొండ, మార్చి 24:

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం దేవుని కోనేటి వద్ద చక్ర పెరుమాళ్లకు నరసింహస్వామి, అనంత పద్మనాభస్వామి సమక్షంలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ అచార్యుల బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో ఆలయ అనువంశిక అర్చకస్వాములు, చక్రపెరుమాళ్లకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతకు ముందు స్వామి దిగువ దేవస్థానంలో ప్రత్యేక సేవా కాలం నిర్వహించి నరసింహ, పద్మనాభ స్వాములను చెరో పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాలు, మంత్రోచ్చారణలతో దేవుని కోనేటి వద్దకు తీసుకుని వచ్చారు. అనంతరం అక్కడ చక్రపెరుమాళ్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి కోనేటిలో చక్రతీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు చక్రస్నానాలు ఆచరించారు. తదుపరి స్వామివార్లు ఆలయానికి చేరుకున్నారు.

ఊయల సేవ

నరసన్న కల్యాణోత్సవాలు చివరి రోజు ఆదివారం రాత్రి స్వామివారి ఆలయ మండపంలో ప్రత్యేక ఊంజలసేవ (ఊయల సేవ) నిర్వహించారు. ఇందుకోసం స్వామి కల్యాణ మండపాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులైన నరసింహ స్వామిని ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో భక్తులు దర్శించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామికి కోరుకొండ నాలుగు మాఢవీధుల్లో శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు స్వామి వారిని చివరిసారిగా దర్శించుకుని మంగళ నీరాజనాలు అందజేశారు.



చక్రపెరుమాళ్లకు పంచామృత అభిషేకాలు

ముగిసిన ఉత్సవాలు

నరసింహస్వామి కల్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ఆదివారం అర్ధరాత్రితో వైభవంగా ముగిశాయి. అంతకుముందు స్వామి వారి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. చివరి ధ్వజాన్ని అవరోహణం చేయడం ద్వారా ఉత్సవాలు శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి.

ముగిసిన పండిత సభలు

నరసన్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న 92వ పండిత సభలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఎందరో పండితులు ఈ ఆధ్యాత్మిక సభల్లో పాల్గొని భారత, భాగవత, రామాయణ, ఇతిహాసాల్లోని అనేక విషయాలను, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఆళ్వారులు ప్రబంధంలోని అనేక భగవత్ విషయాలను వివరించారు. ముగింపు సందర్భంగా సభల్లో పాల్గొన్న పండితులందరినీ ఘనంగా సత్కరించారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా కోరుకొండకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంటరెడ్డి పంతులు ధర్మసత్రంలో ఉచిత నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు సెలవు దినం(ఆదివారం) కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. సుమారు 50 వేల మందికి పైగా అన్నప్రసాదం అందించినట్టు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. ఈ గ్రామోత్సవంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజభట్టర్, పరాసర రఘునాథ భట్టర్, పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పాల్గొన్నారు.





కిటకిటలాడిన లోవ

- మొక్కుబడులు తీర్చుకున్న భక్తులు
- ఆరుబయట సహపంక్తి భోజనాలు



తుని రూరల్, మార్చి24: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా లోవకు తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం సందడిగా మారింది. దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.



సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

సామర్లకోట, మార్చి 24: హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక హోలీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 25న నడపనున్నట్లు విజయవాడ సీనియర్ డీసీఎం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 07646 నంబరు గల సంత్రాగచ్చి-సికింద్రాబాద్ రైలు ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు సంత్రాగచ్చి స్టేషన్‌లో బయలుదేరుతుంది. ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజిపూర్ కియోంజాహార రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బెరహంపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, సింహాచలం, దువ్వాడ అనకాపల్లి మీదుగా సామర్లకోటకు సోమవారం రాత్రి 10.58కు చేరుతుంది. రాజమండ్రికి రాత్రి 9.43 గంటలకు చేరి తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా విజయవాడకు అర్ధరాత్రి 1.10 గంటలకు చేరుతుంది. గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం 8.10 గంటలకు చేరుతుంది. 24 బోగీలతో వివిధ తరగతులకు చెందిన ప్రయాణికులను తమతమ గమ్యస్థానాలకు చేర్చేందుకు 3,500 కిలోమీటర్ల దూరాన్ని 26 స్టాపులతో 96 గంటలలో చేరుతుందని రైల్వే అధికారులు చెప్పారు. మరిన్ని వివరాలకు, రిజర్వేషన్లకు సమీప రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయాన్ని సంప్రదించాలని రైల్వే సీనియర్ డీసీఎం సూచించారు.

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాపారావు



పాపారావును అభినందిస్తున్న సూర్యనారాయణ తదితరులు

కాకినాడ సిటీ, మార్చి 24: ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెల్లుబాని పాపారావు నియమితులయ్యారు. మంగళగిరిలో జరిగిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల సహాయంతో పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పాపారావుకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపి సత్కరించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరణ

ఆత్రేయపురం, మార్చి 24: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి హైదరాబాద్ చంపాపేట్‌కు చెందిన వత్సవాయి సాయి రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతకు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.3,02,619 లభించినట్టు ఈవో చెప్పారు.

అత్తపై అల్లుడి దాడి

- తెగిపోయిన చేతివేలు, తలపైనా గాయాలు
- కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



బిక్కవోలు, మార్చి 24: కూతురు, మనవలను తీసుకెళ్లిపోవాలని చెప్పిన కారణంగా అత్తపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బిక్కవోలు మండలం ఇళ్లపల్లిపాకలు గ్రామంలో ఈ సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.బుజ్జిబాబు అందించిన వివరాల ప్రకారం.. యానాంకు చెందిన గీసాల దుర్గా మోహన్‌కు 2013లో ఇళ్లపల్లిపాకలుకు చెందిన వాసంశెట్టి లోవకుమారితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. మోహన్ తరచూ మద్యం తాగొచ్చి భార్యను కొడుతుండడంతో ఆమె అమ్మగారి ఇంటి వద్దకు వచ్చేసింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. ఆదివారం ఇళ్లపల్లిపాకలు వచ్చిన మోహన్‌ను తన కూతురు, మనవలను ఎందుకు తీసుకు వెళ్లడం లేదంటూ అత్త మంగ నిలదీసింది. దీంతో మాటా,మాటా పెరిగి గొడవ పడి అక్కడ ఉన్న కత్తిపీటతో మంగ తలపై దాడి చేశాడు. ఆమె చెయ్యి అడ్డుపెట్టుకోవడంతో ఆమె కుడి చేయి ఉంగరం వేలు చివరి భాగం తెగిపోయింది. తలపై నాలుగు చోట్ల బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

భార్య ఎడబాటును తట్టుకోలేక ఆత్మహత్య

అనపర్తి, మార్చి 24: భార్య ఎడబాటును తట్టుకోలేక అనపర్తి మండలం కుతుకులూరులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామారావు వివరాల ప్రకారం.. కుతుకులూరులోని కూటేశ్వర కాలనీకి చెందిన మండ వీర వెంకట సత్యనారాయణరెడ్డి(38)కి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తన తల్లి వద్ద ఉంటున్నాడు. భార్య ఎడబాటును తట్టుకోలేని ఆయన ఆదివారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం, మార్చి 24: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఒక దాత రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. చెల్లూరుకు చెందిన బల్ల కోటి ప్రసాద్ ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందజేయగా వారిని అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం, మార్చి 24: ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మడకం జోగమ్మ అన్నారు. మార్క్స్-ఏంగిల్స్ భవనంలో ఆదివారం ఆమె ఆధ్యక్షతన డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని, కోరారు. సర్పంచ్ పల్లాల ఆదిలక్ష్మి, పీవోడబ్ల్యూ నాయకులు సాదల చిలకమ్మ, కానెం లక్ష్మి, బాపనమ్మ, కొమరం రాములమ్మ, కోటం సత్యవతి పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత



రంపచోడవరం మార్చి 24: అరకు పార్లమెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఖరారయ్యారు. ఈ మేరకు బీజేపీ ప్రకటన వెలువరించింది. 2014-2019 మధ్య కాలంలో వైసీపీ నుంచి ఎంపీగా ఎన్నికైన గీత అప్పట్లో వైసీపీని వ్యతిరేకించి కేంద్రంలో బీజేపీతోను, రాష్ట్రంలో టీడీపీతోను సన్నిహితంగా మెలిగారు. అనంతరం ఓ పార్టీని స్థాపించిన గీత కొద్ది కాలానికి ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు. కొత్తపల్లి గీత బీజేపీ అరకు అభ్యర్థిగా వస్తారని కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఆమె ఏడు సెగ్మెంట్లలో చాలా కాలం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నారు.

ఈవీఎంల వినియోగం ఎప్పటి నుంచి అంటే..



సామర్లకోట, మార్చి 24: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. తమకు ఇష్టమైన నాయకులను ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుంది. అటువంటి ఓటును కొందరు దుర్వినియోగం చేసుకుంటే మరి కొంత మంది వినియోగించుకోవడంలోనూ తడబాటు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఓట్ల గల్లంతు అనేది ప్రధానంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకరి ఓట్లు వేరొకరు తొలగించుకునే వరకూ వచ్చింది. ఓటును రక్షించుకునేందుకే ఓటర్లు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇటువంటి పరిస్థితి లేదు. ఓటు తొలగించాలంటే మాన్యువల్‌గా మాత్రమే దరఖాస్తులు చేసి విచారణ చేసిన తర్వాతనే ఓట్లు తొలగింపు జరిగేది. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓట్లు వేసుకునే అవకాశం ఉండేది. ఓటు లెక్కింపునకు రోజులు పట్టేవి. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లదే పైచేయిగా మారింది. అయితే ఇవి ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చాయనే విషయం చాల మందికి తెలియదు.

మొదటి వినియోగం

ఈవీఎం విధానం వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణ, లెక్కింపు సులభమైంది. ఈ పరికరం సుమారు 40 ఏళ్ల కిందటే అందుబాటులోకి వచ్చింది. 1982 మే 19న కేరళలోని పారూర్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వినియోగించారు. మంచి ఫలితాలు రావడంతో 1982, 83 సంవత్సరాలలో దేశంలో జరిగిన పలు ఉప ఎన్నికలలో వినియోగించారు. అప్పటి నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. ఈవీఎంల తయారీ హైదరాబాద్‌లోనే జరిగేది. ఈవీఎంలను పలు రాజకీయ పార్టీలు గతంలోనే వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలోనే 1984 మే 5న సుప్రీంకోర్టు ఈవీ ఎంలను వినియోగించొద్దు అంటూ తీర్పు వెలువరించింది. 1988 డిసెంబరుతో కేంద్రప్రభుత్వం సెక్షన్ 61(ఏ) ద్వారా ప్రజాప్రాతినిధ్య చట్టం పరిధిలో ఈవీఎంల వినియోగం అంశాన్ని చేర్చారు. 1989 మార్చి 15న సవరించడంతో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. 1990 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్నికల సంస్కరణలు కమిటీ ఈవీఎంలను సమర్థించింది. 1992 మార్చి 24న ఎన్నికల నియమావళి 1961ని సవరించి, ఆధీకృతం చేయడంతో 1998లో ప్రజామోదం లభించింది. 1998 ఎన్నికలలో పూర్తిస్థాయిలో ఈవీఎంల వినియోగం జరగకపోయినా 2004లో నిర్వహించిన ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా పూర్తిగా పేపర్ వాడకం మాని ఈవీఎంలనే వాడుతున్నారు. ఇటీవల కాలంలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నాయనే అనుమానాలు పలు రాజకీయ పార్టీలు లేవనెత్తాయి. తిరిగి బ్యాలెట్ పేపర్ విధానాన్నే అమలు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. భారత ఎన్నికల కమిషన్ మాత్రం ఈవీఎంల వలన ఎటువంటి ట్యాంపరింగ్ జరగడం లేదని పారదర్శకంగానే ఎన్నికలు జరుగుతున్నాయని ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇందులో భాగంగానే వీవీ ప్యాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఒక్కో ఈవీఎంలో ఎన్ని ఓట్లు..

ఒక్క పోలింగ్ బూత్‌లో 1900 మంది వరకూ మాత్రమే ఓట్లు వేసేందుకు అవకాశం కల్పించింది. 1900 దాటిన ఓటర్లు ఉంటే రెండో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నిక సంఘమే ఆదేశాలు జారీ చేసింది. ఒక ఈవీఎంలో 2000 వరకే ఓట్లు వేసుకునేందుకు అవకాశం ఉంది. ఒక్క పోలింగ్ బూత్‌కు ఒక ఈవీఎం ఇస్తారు. ప్రతీ ఈవీఎంలోనూ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాట్‌కు అనుసంధానం చేసి ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి వద్ద ఉంటుంది. ఓటరుకు ఓటు ఇవ్వాలా, వద్దా అనే విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాత బ్యాలెట్ యూనిట్‌లోని తనకు నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు తన ఎదురుగా ఉన్న బటన్ నొక్కితే ఓటు నమోదు అవుతుంది. తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లో డిస్‌ప్లే అవుతుంది.

వీవీ ప్యాట్‌లతో ఓటు నిర్ధారణ

ఎన్నికలలో పారదర్శకత పెంచడంతో పాటు ఓటర్ల నమ్మకాన్ని చూరగొనేందుకు ఎన్నికల సంఘం 2013 ఆగస్టు 14న ఈవీఎంలకు వీవీ ప్యాట్‌లను అనుసంధానం చేసింది. వీవీ ప్యాట్ అంటే ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్. ఓటు నిర్ధారణ యంత్రం అని అర్థం. నాగాలాండ్ రాష్ట్రం నాక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి సారిగా 2013 సెప్టెంబరు 4న ప్రయోగాత్మకంగా వినియోగించింది. వీవీ ప్యాట్‌లను దశలవారీగా అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో వీవీ ప్యాట్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం తెలిపింది.

కాంతిమయంగా నిర్మలగిరి



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

దేవరపల్లి, మార్చి 24: నిర్మలగిరి మేరీమాత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు మేరీమాతను దర్శించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మెట్ల మార్గం ద్వారా ప్రధాన ఆలయానికి మోకాళ్లపై ఎక్కి ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మేరీమాత స్వరూపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. దివ్యబలి పూజలు, పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. భక్తుల రాకతో ప్రాంగణం సందడిగా మారింది



తరలివచ్చిన భక్తులు

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, మార్చి 24: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. అధికంగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణ నిత్యాన్నదాన పథకంలో 800మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ప్రజల ఆస్తులను దోచేందుకు కుట్రలు పన్నిన జగన్

మాజీ ఎమ్మెల్యే కొండబాబు



మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 24: ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ప్రజల ఆస్తులను దోచేసేందుకు జగన్‌రెడ్డి కుట్రలు పన్నాడని, రాష్ట్రంలోని సహజ వనరులను దోచుకున్న వైసీపీ వాళ్లు ఇప్పుడు ప్రజల ఆస్తులపై పడ్డారని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. ఆదివారం ఆ యన మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆస్తులను లాక్కుంటూ జగన్‌రెడ్డి పేద కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాడన్నారు. భూ హక్కు చట్టం వల్ల రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని కడప జిల్లా ఒంటిమిట్ట గ్రామంలోని బీసీ చేనేత కార్మికుడు సుబ్బారావుకు చెందిన మూడెకరాల భూమిని వైసీపీ పెత్తందార్లు ఎమ్మార్వో ద్వారా రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వారి పేరు మీద రాయించుకోవడంతో చేనేత కార్మికుడి కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందన్నారు. ప్రజల భూ హక్కుల్ని సివిల్ కోర్టులు రక్షిస్తుండగా, కోర్టుల రక్షణను తొలగించడానికి రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టు అధికారాలను కట్టబెడుతూ ఈ చట్టం తెచ్చారన్నారు. ఈ నల్ల చట్టంతో జగన్‌రెడ్డి ముఠా పేద రైతుల భూముల్ని, ప్రజల ఆస్తులను ఇష్టారీతిన దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారని కొండబాబు విమర్శించారు.

'సహజ వనరులను దోచుకున్న వైసీపీ నేతలు'

జగ్గంపేట, మార్చి 24: ఇప్పటి వరకు సహజవనరులను దోచుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజల స్థిరాస్తులను దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. జగ్గంపేటలో టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలు మూకుమ్మడి ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్నారని, జగన్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బీసీల మానప్రాణాలకు రక్షణ కావాలంటే చంద్రబాబును సీఎం చేయాలన్నారు. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన 3 ఎకరాల భూమిని వైసీపీ నేతలు లాక్కోవడంతో ఆ కుటుంబం సామూహిక ఆత్మహత్య చేసుకుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, పాండ్రంగి రాంబాబు, కింగం రమణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, ముత్యాల సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి పాల్గొన్నారు.

'బడుగు, బలహీన వర్గాలంటే జగన్‌కు చిన్నచూపు'

కరప, మార్చి 24: బడుగు, బలహీన వర్గాలంటే ముఖ్యమంత్రి జగన్‌కు ఆది నుంచి చిన్న చూపేనని టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబి) ఆరోపించారు. కరప మండలం నడకుదురులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలను అనగతొక్కే ప్రయత్నం జరుగుతుందన్నారు. జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీ నాయకుల భూ కబ్జా వల్ల చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుందని దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలకు, వారి ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, ఇదేనా జగన్ చెపుతున్న సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, పులపకూర మహేష్ చాట్ర ఇమ్మానుయేల్, పాట్నీడి రాంబాబు, పంపన కన్నారావు, యాసలపు విష్ణుమూర్తి, దాసరి వీరబాబు పాల్గొన్నారు.

'కోడ్ అమలులో అలసత్వం వహిస్తే వేటు తప్పదు'

పెద్దాపురం, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం వహిస్తే వేటు తప్పదని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఆయన మండల పరిధిలోని జి.రాగంపేట, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తిరుపతి, కాండ్రకోట, కట్టమూరు, జె.తిమ్మాపురం, ఆనూరు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలును పరిశీలించారు. ఎండీయూ వాహనాలను పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకుల బ్యానర్లు, ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించారా లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో విజయకుమారి, డీటీ పద్మజ, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి : ఉమర్‌ఆలీషా

పిఠాపురం, మార్చి 24: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మానవ మనుగడ సుఖశాంతులలో సాగుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పిఠాపురం పట్టణ శివారు నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పక్షుల చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పక్షులకు ఆహారంగా పలు ధాన్యాలను, తాగునీటిని అందుబాటులో ఉంచామని తెలిపారు. పక్షులు వచ్చే వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, లంకపల్లి అశోక్, మంజుల, రేఖా ప్రకాష్, చిర్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీకి అండగా ఉండాలి'

జగ్గంపేట, మార్చి 24: టీడీపీ బీసీలకు పెద్ద పీట వేస్తూ బీసీ సాధికార కమిటీలు ఏర్పాటు చేయడమే కాకుండా సగరులు బీసీడీలో ఉన్న వారికి ఏలోకి మార్చి అన్నివిధాలా ఆదుకుంటున్న టీడీపీకి అండగా ఉండాలని రాష్ట్ర బీసీ సాధికారిక కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్ కోరారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జగ్గంపేట జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూని గెలిపించుకోవడానికి సగరులందరూ పనిచేయాలని, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలన్నారు. బీసీ సాధికార కమిటీ సభ్యులు నంగన శ్రీనివాసరావు, జగ్గంపేట టీడీపీ ఉపాధ్యక్షులు పోట్రూ కృష్ణ, పోంద్రు బాలనాగు, వీరమల్ల సుబ్రహ్మణ్యం, జలతారపు శ్రీను, గండికోట నాగేశ్వరరావు ఉన్నారు.

'మనమంతా అండగా ఉండాలి'

కాకినాడ సిటీ, మార్చి 24: కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా వనమాడి కొండబాబును ప్రకటించినందున మనమంతా అండగా ఉండాలని స్థానిక 10వ వార్డు టీడీపీ నాయకులు ఆదివారం దుమ్ములపేటలోని చర్చిల వద్దకు వెళ్లి కోరారు. ఆయా చర్చిల పాస్టర్లు, సంఘ సభ్యులను కలిసి కొండబాబు విజయకేతనం ఎగురవేసేలా ప్రార్థనలు చేయాలని విన్నవించుకున్నారు. దుమ్ములపేటలోని 2 రామాలయాల కమిటీ సభ్యులు, భక్తులను కలిసి మనందరం కలిసికట్టుగా సమష్టి కృషితో కొండబాబును గెలిపించుకోవాలని కోరారు. చోడిపిల్లి సతీష్, మేరుగు రాజన్న, గంట నూకరాజు, కొయ్య తాతారావు, అనుసూరి శ్రీనివాస్, మాదే అంద్రియ్య పాల్గొన్నారు.

సుభాష్‌కి జనసైనికుల మద్దతు

కాజులూరు, మార్చి 24: మండల జనసైనికులు రామచంద్రపురం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కి సంపూర్ణ మద్దతు పలికారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కాజులూరులో జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. జనసైనికులతో సుభాష్ మాట్లాడుతూ తన గెలుపులో జనసేన మద్దతు కీలకం కాబోతుందన్నారు. టీడీపీతో పాటూ జనసేన, బీజేపీ కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పిస్తానంటూ హామీఇచ్చారు. మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, జనసేన నాయకులు అణ్యం శ్రీరామచంద్రమూర్తి, గందం పళ్ళం రాజు పాల్గొన్నారు.

రాజగోపాలస్వామి రథోత్సవం

ప్రత్తిపాడు, మార్చి 24: మండలంలోని ధర్మవరంలో ఆదివారం రాత్రి రుక్మిణీ సత్యప్రభ సమేత రాజగోపాలస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవాల సందర్భంగా రథోత్సవానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. నంది సెంటర్‌లో రథాన్ని పూలమాలతో అలంకరించి రహదారి మీదుగా ఊరేగించారు. స్వామి,అమ్మవార్లకు టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంధన ఏసుబాబు, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఇనుగంటి రాజా, కృష్ణ ప్రసాద్‌బహదూర్, సొసైటీ అధ్య క్షుడు జువ్వల బాబు, ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డి పట్ల సోమన్న దొర, బొల్లు రాజబాబులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీనరసింహాచార్యులున్నారు.

మహిళ ఆత్మహత్య

కాకినాడ రూరల్, మార్చి 24: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని మహాలక్ష్మీ నగర్‌లో నివాసముంటున్న తన కుమార్తె ఇంట్లో కామాడి సత్యవతి(58) అనే వివాహిత శనివారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఏఎస్ఐ భీష్మకుమార్ తెలిపారు. ఆమె గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నదని, భర్త పేరు గంగరాజని, ఆమెది స్వస్థలం తాళ్లరేవు మండలం లక్ష్మీపతిపురమని తెలిపారు. కొద్దికాలంగా అనారోగ్యం కారణంగా తన కుమార్తె వద్ద తూరంగిలో నివాసముంటున్నదన్నారు. అనారోగ్యం ఎక్కువ కావడంతో అధిక మోతాదులో టాబ్లెట్లు తీసుకోవడంతో గాబరా ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఆత్మహత్యచేసుకుందన్నారు. మృతురాలి కుమార్తె కర్రి గోవలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ

సర్పవరం జంక్షన్, మార్చి 24: కాకినాడ రూరల్ వలసపాకల సెంటర్లో ఆదివారం సీఐటీయూ, యూటీఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేశ్ 93వ వర్ధంతి పురస్కరించుకుని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు టి.రాజా, వివి రమణ, ఎం.వెంకటరమణ నాయకులు సత్యనారాయణ, రామకృష్ణరాజు, సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

» మట్టలను పూలతో అలంకరించి ప్రదర్శనలు » ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



ఏలేశ్వరంలో మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



సామర్లకోట మండలం పనసపాడులో ప్రదర్శన



కరప మండలంలో చిన్నారుల ప్రదర్శన



పిఠాపురంలో మట్టలతో చిన్నారుల ప్రదర్శన

పెద్దాపురం, మార్చి 24: పట్టణ, మండల పరిధిలోని మట్టల ఆదివారం పండుగను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా ఆదివారం నిర్వహించుకున్నారు. ఈత మట్టలను పూలతో అలంకరించి వాటిని పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. స్థానిక తండ్రీ కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో హోసన్న ఏసన్న అంటూ ప్రభువును స్తుతించారు. పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ మట్టల ఆదివారం అనేది క్రైస్తవ విశ్వాసుల గొప్ప విందు అని, సువార్తలను చెప్పి సంఘటనల జ్ఞాపకార్థం దీనిని విశ్వాసులు జరుపుకుంటారని పేర్కొన్నారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనా గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రౌతు సూరిబాబు, డానియేలు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉదయం నుంచే ఈత మట్టలకు రంగురంగుల పువ్వులతో అలంకారం చేసి చర్చిలకు తీసుకువెళ్లారు. అక్కడ ప్రార్థనల అనంతరం పురవీధుల్లో మట్టలతో ప్రదర్శనలు చేశారు. పిఠాపురంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి, బెతెస్థ బాప్టిస్టు చర్చి, రథాలపేట, ఇందిరానగర్, జగ్గయ్యచెరువు కాలనీ, అగ్రహా రం తదితర ప్రాంతాల్లోని చర్చిలతో పాటు చిత్రాడలోని బైబిల్‌మిషన్, జములపల్లిలోని బర్నింగ్ టూల్ మినిస్ట్రీస్, జల్లూరు, రాపర్తి, గోకివాడ తదితర ప్రాం తాల్లోని చర్చిల్లో మట్ల ఆదివారం పండుగ జరిగింది. కార్యక్రమాల్లో చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట బ్రౌన్‌పేట వీధుల మీదుగా క్రైస్తవ సోదరులు ఈతమట్టలకు పువ్వులు గుచ్చి ప్రదర్శనలుగా ప్రార్థనా మందిరానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మండలంలోని పనసపాడు పల్లపువీధిలో యెహోవాయీరే ప్రార్థనా మందిరం సంఘస్తులు, చిన్నారులు ఈతమట్టలకు పువ్వులు గుచ్చి గ్రామంలో ప్రదర్శనలు చేస్తూ దేవుని ని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు. క్రీస్తు సువార్తను ప్రకటించారు. అనంతరం చర్చిలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఎస్.ప్రభుదాస్ దైవ సందేశం అందించారు. కార్యక్రమంలో యాదిద్య, సిస్టర్ ఛాయా, ఏంజెల్, సంఘస్తులు పాల్గొన్నారు.

కరప: మండల గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. చిన్నారులు, మహిళలు ఈత ఆకులను చేతపట్టి ఏసుప్రభువును కీర్తిస్తూ ఊరేగారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పి.సత్యప్రసాద్, సెక్రటరీ పి.సామ్యూల్‌రాజు, ట్రెజరర్ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, ఉపాధ్యక్షుడు డి.ఏసురత్నం, ఎస్.భరత్‌కుమార్, కె.శేఖర్‌మోజెస్, ఐ.జాన్‌ప్రకాష్,స్టీఫెన్‌బాబు పాల్గొన్నారు.

గండేపల్లి: జెడ్.రాగంపేటలో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు సురేంద్ర కుమార్, లాజర్, సుదర్శన శామ్యూల్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఈస్టర్ పండగకు ముందువచ్చే జయప్రవేశం(మట్టల ఆదివారం) పండుగను ఏలేశ్వరంలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, మెయిన్ రోడ్డులో చర్చ్ పాస్టర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈతకొమ్మలతో క్రైస్తవులు, చిన్నారులు ప్రదర్శనగా పట్టణవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కె.ప్రశాంత్ కుమార్, మర్రిపూడి మనోహర్, పేకల జాన్, గాంధీ, విజయలక్ష్మి, రాజు, గణేష్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు, మండలపరిధిలోని గ్రామాల్లో మట్ల ఆదివారం పండుగ జరిగింది. చేబ్రోలు ఆంధ్రా బాప్టిస్టు చర్చి నుంచి చిన్నారులు, పెద్దలు ఏసుక్రీస్తు నినాదాలు చేసుకుంటూ వీధుల్లో మట్లతో ప్రదర్శనలు జరిపారు. సంఘ వ్యవస్థాపకుడు ఎం.ప్రభుదాస్, సంఘకాపరి జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండల గ్రామాల్లో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు పూల మట్లతో శాంతి ర్యాలీ చేశారు. శాంతి కోసం జీసెస్ ప్రాణత్యాగం చేశారని మత బోధకులు తెలిపారు.

30న 'రన్ ఫర్ జీసస్'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 24: క్రీస్తు పునరుద్ధానం పురస్కరించుకుని కాకినాడ నగరంలో ఈనెల 30న ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) కమిటీ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం, రూరల్ ప్రెసిడెంట్ దేవిశెట్టి చార్లెస్ ఆదివారం తెలిపారు. భానుగుడి జంక్షన్ నుంచి ఆనందభారతి గ్రౌండ్ వరకు ఈ రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి అన్ని సంఘాల నుంచి దైవజనులు, సంఘ విశ్వాసులు పాల్గొనాలని కోరారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి తిరోగమనం

ఎమ్మెల్యే చినరాజప్ప
వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



పెద్దాపురం: టీడీపీలో చేరినవారితో చినరాజప్ప



ఏలేశ్వరం: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

పెద్దాపురం, మార్చి 24: రాష్ట్రంలో వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలోకి వెళ్లిపోయిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురంతో పాటు మండలంలోని కట్టమూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీనిలో భాగంగా పట్టణ పరిధిలోని 23వ వార్డు వ్యాపార వుంతకు చెందిన సుమారు 50 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కట్టమూరు గ్రామంలో సుమారు 200 మంది టీడీపీలో చేరగా వారందరికీ రాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టిననాటి నుంచి ఇప్పటివరకూ అభివృద్ధి కనుచూపుమేరలో కూడా కనిపించడం లేదని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ప్రజలు వైసీపీ పాలనపై పూర్తిగా విసిగిపోయారని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నాని, తూతిక రాజు, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్, మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, సానిపిన రామకృష్ణ, ఏలేటి సుబ్బారావు, పెట్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: విజన్, దూరదృష్టి ఉన్న నేత నారా చంద్రబాబు అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. మండలంలోని మాధవపట్నంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజప్పతో పాటు జనసేన పార్టీ పెద్దాపురం ఇంచార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి విత్తనాల వెంకటరమణ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. చీకట్ల వెంకటేష్, రాజా సూరిబాబు రాజు, వాసిరెడ్డి యేసుదాస్, పెంకే వెంకటేష్, కృష్ణవేణి, పాలకుర్తి శ్రీనుబాబు, కుర్రా నారాయణస్వామి, జి.సర్వేశ్వరరావు, జెమ్మీ ఉన్నారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, మార్చి 24: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గంటా రమణ ఆధ్వర్యంలో పాలచర్ల రాజేష్, కోట వీరబాబు, కరిబెండ రాజేష్, కట్టు అశోక్, కోట వీరబాబు, కరిబెండి రాజేష్, కట్టు అశోక్, కండిపల్లి చెల్లయ్యమ్మ, బత్తిన సింహాద్రి, ఎర్ర సత్యవేణి, కక్కుల వెంకటలక్ష్మి, దుంగ పార్వతి, తదితర 100 కుటుంబాలు వైసీపీ రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, కింగం రమణ, దేగల సత్తిబాబు, పిలా మహేష్, కొండ్రోతు శ్రీను, రాయి సాయి, హరిశెట్టి గంగ, పలివెల ఏసురాజు, ముత్యాల బుజ్జి ఉన్నారు.

బూరుగుపూడిలో...

కిర్లంపూడి, మార్చి24: మండలంలోని బూరుగుపూడిలో ఆదివారం కుంచే సీతారామయ్య, పాటంశెట్టి రవి ఆధ్వర్యంలో సుమారు వందమందికిపైగా వైసీపీ నాయకులు బడి పాటంశెట్టి విశ్వనాధం, తూము వెంకటేశ్వర్లు, తలపాల అర్జునరావు, సోము నాని, అనుకుల రాంబాబు, కుండ్ల మహంతి చక్రరావు, బులివీరన్న, కొండా సురేఖ తదితరులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పాటంశెట్టి కొండరాజులు, కర్నాకుల పెదకాపు, బాలుకుల చిన్నోడు, తోట వెంకటేశ్వర్లు, మూరా సత్తిబాబు ఉన్నారు.

జె.అన్నవరంలో...

ఏలేశ్వరం, మార్చి 24: జె.అన్నవరంలో ఆదివారం సుమారు 120మంది వైసీపీ వీడి టీడీపీలో చేరారు. గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వైసీనీకి చెందిన మహిళలు, యువకులు గంటా సత్తిబాబు, కొండపల్లి సూరిబాబు, దాసం సూర్యానారాయణ, ఎస్. నాగేశ్వరరావు, వీర్రాజు, ఏనుగు మహాలక్ష్మీ, ధర్మరాజు, బత్తుల సత్తిబాబు, పినపర్తి వెంకటేశులు, కొండపల్లి భద్రయ్య. కొండపల్లి పద్మరాజు సీతారామరాజుకు టీడీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామంలో మీ కోసం మీసత్యపభ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకి ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గొల్లపల్లి, టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, మాజీ జడ్పీటీసీలుజ్యోతుల పెదబాబు, పసల సూరిబాబు, బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, చిక్కాల లక్ష్మణరావు, బీజేపీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, పెంటకోట శ్రీధర్ పాల్గొన్నారు.

తేటగుంటలో...

తుని రూరల్, మార్చి 24: తేటగుంట టీడీపీ కార్యాలయంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరగా వారికి టీడీపీ యువ నేత యనమల రాజేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కాలిన అప్పారావు, కొయ్యా సూరిబాబు, అమ్మజలపు బాబ్జి, కొంజెర్ల సూరిబాబు, అంబులపు చిన్ని, నేమాల కొండబాబు, పండు, యాదాల అప్పారావు, కొంజర్ల బాబురావు ఉన్నారు. టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, చింతమనీడి అబ్బాయి, యనమల లక్ష్మణరావు, కొయ్యా రామకేశవరావు, కుమ్మరి నాగేంద్ర, బద్ది నాగేశ్వరరావు, జనసేన నాయకులు గిరికన రాజబాబు,రాజా శేషు పాల్గొన్నారు.

'అరాచక పాలనను అంతమొందించాలి'



ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మి

నడకుదురు (కరప), మార్చి 24: ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలని కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. కరప మండలం నడకుదురులో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర బాగు కోసం జనసేన, టీడీపీ, బీజేపీ ఒక్కటై ఈ ఎన్నికల బరిలో నిలిచాయని, ప్రజలందరూ సహృదయంతో అర్థం చేసుకుని అధికారం కట్టబెట్టాలని విజ్ఞప్తిచేశారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కో-కోర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, ఆయా పార్టీల నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి, బండారు మురళి, దేవు వెంకటేశ్వరరావు, చీపురుపల్లి జయేంద్రబాబు, యాసలపు విష్ణుమూర్తి, తుమ్మపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, కోటగిరి మహేంద్రబాబు, యాసలపు దుర్గాప్రసాద్, పంపన కన్నారావు, పులపకూర మహేష్, పిల్లి రాముడు, మద్దూరి స్వామి, వీరంరెడ్డి ముత్యాలరావు, రమేష్, మెండు గోవిందు పాల్గొన్నారు. కరపలో సీతమ్మపేట, పల్లపువీధిలకు చెందిన 40మంది జనసేనలో చేరగా వారికి పంతం నానాజీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నేతలు బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు పాల్గొన్నారు.

'తగాదాలు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు'

కాకినాడ క్రైం, మార్చి 24: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని.. ఎన్నికల్లో తగాదాలు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని త్రీటౌన్ సీఐ కృష్ణ భగవాన్ స్పష్టం చేశారు. ఆదివారం కాకినాడ సిటీ బ్యాంకుపేటలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణపై యువత,ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ తగాదాలు, గొడవల జోలికివెళ్లవద్దని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా దౌర్జన్యాలకు దిగిన కేసులు తప్పవన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

కాకినాడ రూరల్, మార్చి 24: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీస్‌లు సంయుక్తంగా రూరల్ మండలం తూరంగిలో ఆదివారం కవాతు నిర్వహించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ ఎస్డీపీవో హనుమంతరావు ఆదేశాలతో ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూరంగిలో సీఐ, ఎస్ఐ మణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో సీఐ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గ్రామంలోని యువత, స్థానికులకు అవగాహన కల్పించారు.

తునిలో...

తుని రూరల్, మార్చి 24: తునిలో పోలీసులు సీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ గీతారామకృష్ణ ప్రజలకు అవగాహన కల్పించి ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు.

నెహ్రూను కలిసిన ఉదయ్‌శ్రీనివాస్



ఉదయ్‌శ్రీనివాస్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, మార్చి 24: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను కాకినాడ పార్లమెంటరీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కలిశారు. టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ కలయిక నిర్వహించి ఒకరికొకరు సత్కరించుకున్నారు. ఉదయ్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని నెహ్రూ అన్నారు. ఉదయ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలిసి ఎన్నికల్లో నన్ను, నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, చదరం చంటిబాబు, పాండ్రంగి రాంబాబు, కాకినాడ పార్లమెంట్ జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, జ్యోతుల శ్రీనివాస్, పిల్లా శ్రీధర్, కురుమళ్ళ రాం బాబు, జ్యోతుల సతీష్, బీఎస్‌రాజు, వీర మహిళలు తోలేటి శిరీష, కోలా దుర్గ,పిల్ల రమయ్య ఉన్నారు.

రాజప్పను కలిసిన ఉదయ్‌శ్రీనివాస్

పెద్దాపురం, మార్చి 24: కాకినాడ పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి రాజప్పను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలియచేశారు.

టీడీపీ నేతకు బహుమతి

జగ్గంపేట, మార్చి 24: సీతానగరం గ్రామానికి చెందిన నందిగం రాము మన టీడీపీ యాప్‌లో 30వేల పాయింట్లు సాధించి రాష్ట్ర బహుమతిని సాధించారు. ఆదివారం ఈ బహుమతిని జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా అందుకున్నారు.

'ఎన్నికల నిర్వహణకు సహకరించాలి'



పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

గొల్లప్రోలు, మార్చి 24: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ కోరారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చిన జగ్గంపేట, కొడవలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. కొడవలిలో గ్రామస్తులతో మాట్లాడు తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ ఉన్నారు.

వైభవంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం, మార్చి 24: పట్టణంలోని పెద్దబజారులో నూతనంగా పునర్నిర్మించిన నూకాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి దివ్య విగ్రహ పునఃప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం మండపపూజ, గర్తన్యాసం నిర్వహించిన అనంతరం వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య ప్రతిష్ఠ గావించారు. హోమాలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారిని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఐశ్వర్య సిద్ది గణపతి ప్రతిష్ఠ

గొల్లప్రోలు రూరల్, మార్చి 24: మండలంలోని దుర్గాడ ఈబీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఐశ్వర్య సిద్ది గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. మహాగణపతిపూజ, పుణ్యాహావాచనం, అంకురార్పణ, హోమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ సుదర్శనం దుర్గబాబు ఆధ్వర్యంలో గణపతి ప్రతిష్ఠ, కుంభ కళా ఆవాహన, గోదృష్టి, మహాపూర్ణాహుతి జరిగాయి. మహా అన్నదానం నిర్వహించారు. స్వామిని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తదితరులు దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వాకాడ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ

కరప, మార్చి 24: వాకాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం గ్రామదేవతలు ముసాలమ్మతల్లి, సోమాలమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. టీటీడీ నిదులు రూ.10లక్షలతో బాటు గ్రామస్తుల విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు నిర్వాహకులు తెలిపారు. 3రోజుల పాటు హోమం, శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించిన అనంతరం ఆదివారం విగ్రహాలను ప్రతిష్ఠ గావించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, సర్పంచ్ అడబాల సత్యప్రసాద్, ఎంపీటీసీ చక్కపల్లి ప్రకీర్రావు, వైసీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ప్రవాసాంధ్రుడు పులి రామలింగేశ్వరరావు, అడబాల బుచ్చిబాబు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నసంతర్పణ జరిగింది.

నూకాలమ్మ పూలగరగల ఉత్సవం

పెద్దాపురం, మార్చి 24: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ పూలగరగల ఉత్సవాన్ని ఆదివారం దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వచ్చే నెల 7న ప్రారంభం కానున్న అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ముందుగా పూల గరగలను తీయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా పూలగరగలను ప్రత్యేకంగా తీసుకువచ్చిన పలు రకాల పుష్పాలతో అలంకరించి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గరగలను శిరస్సుపై ధరించి అమ్మవారి ఆలయం ముందు ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవానికి అధికంగా భక్తులు తరలివచ్చారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం, మార్చి 24: స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో చండీహోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రజలకు సకల శుభాలు, కార్యాలు నెరవేర్చేందుకు ఈ చండీహోమం జరుగుతుందని పండితులు తెలిపారు. చండీహోమం అనంతరం అమ్మవారికి పుష్పపూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, అధికంగా మహిళలు పాల్గొన్నారు.

కొండరాజులబాబు పండుగ

గండేపల్లి, మార్చి 24: మండలంలో మల్లేపల్లి గ్రామ శివారున గొల్లపల్లి వీరబాబు జీడిమామిడితోటలో ఆదివారం కొండరాజులబాబు పండుగ ఘనంగా నిర్వహించారు. కొండరాజుల బాబుకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి భోజనాలు చేపట్టారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు.

జనసేనకు సరోజ రాజీనామా

సర్పవరం జంక్షన్, మార్చి 24: జనసేన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆ పార్టీ నాయకురాలు పి.సరోజు తెలిపారు. ఆదివారం సర్పవరం జంక్షన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు. పార్టీలో తగిన గుర్తింపు లేదని, ఇందుకు రాష్ట్ర పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్,హరిప్రసాద్ తదితరులే కారణమని ఆరోపించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీలు

గొల్లప్రోలు, మార్చి 24: జాతీయ రహదారిపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. చెందుర్తి సెంటర్ అన్ని రకాల వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. తనిఖీల్లో స్క్వాడ్ ఇన్‌చార్జి ఎన్.వెంకటేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

రౌతులపూడి: గ్రామంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీస్‌లు తనిఖీలు చేపట్టారు. అనుమానం వచ్చిన కార్లు, బైక్‌లపై బ్యాగ్‌లతో వెళుతున్నవారిని ఆపి తనిఖీ చేశారు.

